# మంచి రోజులొస్తాయనే ఆశను కలిగిస్తోంది 'కవిత్వం'

● కేంద్ర సాహిత్య అకాడమీ 'దక్షిణ భారత కవి సమ్మేళనం'లో శివారెడ్డి




సమ్మేళనంలో కవులు

**హైదరాబాద్ సిటీ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి):** ప్రస్తుతం దేశంలో అతి కఠినమైన పరిస్థితులు నెలకొన్నాయని, ఫాసిజం అన్ని రంగాలలోకి చొచ్చుకొని వస్తోందని కేంద్ర సాహిత్య అకాడమీ తెలుగు కమిటీ కన్వీనర్, ప్రముఖ కవి కె. శివారెడ్డి వ్యాఖ్యానించారు. పదేళ్ల తర్వాత భారత దేశ ముఖచిత్రం ఎలా ఉంటుందో ఊహకు కూడా అందని పరిస్థితి అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి చేదు కాలంపై వివిధ భాషల్లోని కవుల ప్రతిస్పందన ఎలా ఉందో తెలుసుకోవడానికి ఈ వేదిక తోడ్పడుతుందని అన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో గురువారం రవీంద్రభారతి, పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్ వేదికపై దక్షిణ భారత కవిసమ్మేళనం జరిగింది.కార్యక్రమ ముఖ్య అతిథి కె. శివారెడ్డి మాట్లాడుతూ దేశంలోని నియంతృత్వ పాలనపై అన్ని భారతీయ భాషల్లో నిరసన కవిత్వం వస్తోందన్నారు. దీన్నొక మంచి పరిణామంగా అభివర్ణించారు. ధిక్కార కవిత్వం చదువుతుంటే, మంచిరోజులు రానున్నాయనే ఆశ కలుగుతోందని అన్నారు. నియంతృత్వాన్ని నిలదీసే సాహిత్యం చాలా రావాలని, అది సమకాలీన పరిస్థితులకు సంబంధించిన అన్ని పార్శ్వాలనూ సృజించాలని కె. శివారెడ్డి ఆకాంక్షించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగు, ఉర్దూ, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ, కొలామి, గోండి భాషలకు చెందిన 15మందికిపైగా కవులు కవిత్వ పఠనం చేసినట్లు తెలిపారు. ఇటువంటి కవి సమ్మేళనాల ద్వారా ఆయా భాషల్లో వెలువడుతున్న కవితా రీతులు, వస్తు వైవిధ్యత వంటి విషయాలను ఒకరికొకరు తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు.తెలుగు సాహిత్య రంగం నుంచి ప్రముఖ కవులు నందిని సిధారెడ్డి, ఆశారాజు, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, కవయిత్రి శోభాభట్ కవిత్వ పఠనం చేశారు. కానేష్ పూనూర్ (మలయాళం), అర్చన ఎన్. పాటిల్ (కన్నడం), మణికందన్ (తమిళం), ఆత్రం మోతీరాం(కొలామి), మొహమ్మద్ అబ్దుల్ నయీం(ఉర్దూ), కొట్నాక్ సాయికుమార్ (గోండి) తదితర కవులు, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి ఎస్.రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.